
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్ధమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్ధికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# కోకిల గూళ్ళు

" ఈ వెంచర్ చాలా బావుంది, రింగ్ రోడ్ కి కూడా దగ్గర, చూడండి. బావుంది అనుకుంటే అందరం కలిసి బుక్ చేసుకోవచ్చు, గ్రూప్ డిస్కవుంట్ కూడా అడగచ్చు" అన్నాడు అరుణ్ తన చేతిలో ఉన్న బ్రోచర్ స్నేహితులకి చూపిస్తూ. అతను చూపించిన వెంటనే దాన్ని ఆత్రంగా అందుకుని పరిశీలించడం మొదలు పెట్టారు వినయ్, కార్తీక్.

" బావుందిరా! చాలా ఖాళీ జాగా వదిలాడు చుట్టూ, రెండో కార్ కొనుక్కుంటే పనికి వస్తుంది పార్కింగ్ కి" అన్నాడు కార్తీక్.

పక పకా నవ్వాడు యోగి అతని మాటలకి. కార్తీక్ పెద్దగా పట్టించుకోలేదు అతని నవ్వుని. " నువ్వేమంటావ్ " అన్నట్టు వినయ్ వైపు చూశాడు

" నాకూ బానే ఉంది, ఒక సారి వెళ్ళి చూసి వద్దాం, మనకున్న డౌట్ లన్నీ తీర్చేసుకుంటే బుక్ చేసేసుకోవచ్చు "అన్నాడు వినయ్.

" డౌట్ లా? ఇంకేమున్నాయి? మొన్నొకసారి వెళ్ళి మాట్లాడాం కదా? "అన్నాడు అరుణ్.

" ఇంకొక్కసారి చూస్తే బావుంటుందని అన్నాను. అదీ కాక డబ్బు చూసుకోవద్దూ? ఇదేమో పెద్ద వెంచర్ కదా " అన్నాడు వినయ్.

" మన జీతాలు చూసి బాంక్ వాళ్ళు ఇంటికొచ్చి లోన్ లిస్తారు, నెలకింతని తీర్చడం పెద్ద కష్టం కాదు రా, నా మాట నమ్ము! " అన్నాడు అరుణ్.

నాలుగు అంతస్థుల్లో రెండు బ్లాకుల్లో కడుతున్న వంద ఫ్లాట్ ల ఆ వెంచర్ ఆ స్నేహితులందరికీ బాగా నచ్చింది, మరీ ఎక్కువ అంతస్థులు లేవు, ఎక్కువ ఫ్లాట్ లు లేవు. సిటీకి కొద్దిగా దూరమైనా అభివృద్ధి చెందే సూచనలున్న ప్రాంతం అని అనిపిస్తోంది. అందుకనే అందరికీ ఉత్సాహంగా ఉంది.

తమలో నాలుగో వాడు యోగి ఏమీ మాట్లాడకపోవడంతో అరుణ్ నవ్వుతూ

" ఏం స్వామీ! యోగీంద్ర యతిదేవులు, తమరేమీ మాట్లాడడం లేదు, మీ అభిప్రాయం కూడా చెప్పండి!" అన్నాడు.

యోగి నవ్వాడు.

"ఒరే, యోగీంద్ర అని మీ అమ్మా, నాన్నలు ఏ ముహూర్తాన పేరు పెట్టారో తెలీదు కానీ, అది మా చావుకొచ్చింది. అన్నింటికీ మహా యోగి పుంగవుడిలా ఒక నవ్వు పారేస్తావు అంతే. నవ్వాపి నీ అభిప్రాయమేమిటో చెప్పేడు" అన్నాడు విసుగ్గా.

" నాకీ ఇళ్ళు కొనడాల మీద నమ్మకం లేదురా!, హాయిగా అద్దె ఇల్లైతే మనిష్టమొచ్చిన చోట ఇష్టమైన ఇంట్లో దర్జాగా ఉండచ్చు, లేదూ చేతిలో డబ్బున్నప్పుడే ఇల్లు కొనుక్కోవచ్చు " అన్నాడు యోగి.

"వీడిదంతా వితండ వాదం లేరా, మనిషన్నాకా సొంత ఇల్లుండద్దూ, కావలిస్తే మనమే ఉండవచ్చు, లేదంటే అద్దెకిచ్చుకోవచ్చు. అంతే కానీ ఇళ్ళు కొనడాల మీద నమ్మకం లేదు, సొంత ఇల్లంటే ఇష్టం లేదు అనే వాళ్ళకి ఏం చెప్తాము?" అన్నాడు వినయ్.

" ఇంత పెట్టి ఇల్లు కొనాలంటే మన చేతిలో అంత డబ్బు ఎప్పటికి ఉంటుందని నీ ఉద్దేశ్యం? నువ్వు తీరిగ్గా డబ్బు సమకూర్చుకుని ముసలాడివయ్యాకా కొనుక్కుందాం అనుకునే టైముకి ఈ ఇళ్ళూ ఉండవూ, ఈ రేట్లూ ఉండవు అన్నాడు" కార్తీక్ కోపంగా.

"అలాంటప్పుడు అంత పెట్టి" అని ఇంకా ఏదో చెప్పబోతున్న యోగిని మధ్యలోనే ఆపి.

"వీడి తత్వం మనకి తెలియనిదేమిట్రా? మనతో పాటే వీడూనూ. మనం బుక్ చేస్తే, వీడికీ ఒకటి చేసేద్దాం. చచ్చినట్టు కడతాడు" అన్నాడు అరుణ్.

అందరూ నవ్వారు ఆమాటకి. తర్వాత మిత్రులందరూ కబుర్లలో పడిపోయారు.

" ఒరే ఇవ్వాళ నాది, కార్తీక్ గాడిది వంట. మీరిద్దరూ కాస్త ఇల్లు సర్దే ప్రోగ్రాం చూస్తే మా నలభీములం వంట లో పడతాం" అన్నాడు యోగి.

" చిత్తం , మహారాజా! అన్నారు వాళ్ళిద్దరూ. మళ్ళీ అందరూ నవ్వారు.

" ఒరే, ఇలా ఆడుతూ, పాడుతూ, నవ్వుతూ హాయిగా ఉండలేమా ఎప్పుడూ?" అన్నాడు యోగి సడన్ గా

" అలా ఉండాలనే కదా మన తాపత్రయం" అన్నాడు కార్తీక్ అతని మాటలు అర్థం కానట్టుగా.

" వాడిని పట్టించుకోకుండా వంట సంగతి చూడండి రా బాబూ! కడుపులో ఎలకలు" అన్నాడు అరుణ్ దాదాపు అరుస్తున్నట్టు. మరొక గంటకి నలుగురూ భోజనాలకి కూర్చున్నారు.

" ఒరే మన వంట మనమే వండుకోవచ్చు అన్న నీ ఐడియాకి నా జోహార్లు రా ! యోగీ. లేకపోతేనా? ఇంత కమ్మటి భోజనం మిస్ అయిపోవాళ్ళం కదా? " అన్నాడు అరుణ్ పప్పు పులుసు అన్నం కలుపుకుంటూ.

" నిజమేరా, మనకేం చేతవుతుంది? అనుకున్నాం కానీ ఇంత తొందరగా ఇన్ని రకాలు నేర్చుకుంటామని అనుకోలేదు.థాంక్స్ రా యోగీ! " అన్నాడు కార్తీక్ కూడా.

" రాదనుకుంటే ఏదీ రాదు. రోజూ ఒకేలా ఉండే ఆ హోటల్ భోజనాలు చూస్తేనే నాకు జీవితం మీద విరక్తి వచ్చేది, అందుకే అన్నాను. మొదటి నాలుగురోజులు ఇబ్బంది పడితే పడ్డాము కానీ మెల్లిగా అన్నీ కుదురుతున్నాయి కదా. తినడానికి ముందే రుచి తెలిసిపోయేలా ఉండే ప్రెడిక్టబిలిటీ అంటే నాకు చిరాకు " అన్నాడు యోగి నవ్వుతూ.

మొదట్లో దగ్గరలోని హోటల్ లోనో, మెస్ లోనో భోజనం చేసేవారు నలుగురూ. పొద్దున్న టిఫిన్ దగ్గరనించీ రోజూ బయట తినడం తొందరలోనే విసుగు వేసింది వారికి. దానికి అనేక కారణాలు, ఏం వండినా రోజూ ఒకేలా ఉండే రంగూ, రూపూ, రుచీ ముఖ్య కారణం అయితే, ఆ సమయాలకి అక్కడ ఏర్పడే రద్దీ మరొక కారణం. ఇంటికి వచ్చాకా స్నానాలు చేసి మళ్ళీ బయట పడాలంటే బద్ధకం, అదీ కాక అందరికీ ఒకే సమయానికి కలిసి, తెమిలి వెళ్ళడమూ కష్టమే అయ్యేది ఒక్కోసారి.

అప్పుడే యోగి అన్నాడు " ఈ మాత్రం వంట మనం వండుకోలేమా? " అని. మొదట మిత్రులు " లేము" అన్నారు. ఆ తర్వాత ఆలోచించారు. అలా ఆచరణలోకి తెచ్చారు.

ఇంటర్మీడియేట్ లో ఒకే కాలేజీలో కలిసిన వాళ్ళ స్నేహం వయసు దాదాపు పదేళ్ళు. కార్తీక్, అరుణ్, వినయ్, యోగి. అందరూ తెలివైన, కష్టపడే మనస్థత్వం ఉన్న విద్యార్థులే కావడం చేత ఓ రెండు, మూడు మార్కులు అటూ, ఇటూగా సమానంగా ఉండేవారు. నలుగురిలోకి యోగి కాస్త విభిన్నంగా ఉండేవాడు. కేవలం క్లాస్ పుస్తకాలే కాక, ఇతర పుస్తకాలు చదవడం, వార్తలూ, విశేషాలు తెలుసుకోవడం అతనికి అలవాటు. ఇంటెన్సివ్ కోచింగ్ పేరిట చదువుకు తప్ప మరే ఇతర విషయాలకీ టైముండని సమయంలో కూడా అతను రోజులో కాసేపు ఏదో ఒక పుస్తకం చదివేవాడు. అది వార్డెన్ చూస్తే ఏమంటారో? అని స్నేహితులు భయపడేవారు.

అదొక్కటే కాదు, ప్రతీ రోజూ 'సుడోకూ పజిల్ చెయ్యడం అతనికి అలవాటు. అది ఎప్పుడూ మానేవాడు కాదు. ఎప్పుడూ టైము దొరకకపోతే రాత్రి పడుకునేముందు ఫోన్ వెలుగులోనైనా సరే పూర్తి చేసే నిద్ర పోయేవాడు. అప్పుడప్పుడూ కవిత్వం రాసుకునేవాడు ఇంగ్లీష్లో, మూడు నాలుగుసార్లు తిట్లు తిన్నాడు, బాగా చదివేవాడు కనక ఇవన్నీ చూసీ చూడనట్టుగా ఊరుకునేవారు అతని టీచర్లు. ఎందుకో యోగికి మొదటినించీ నలుగురూ చేసినది చెయ్యడం ఇష్టం ఉండేది కాదు. అది వాళ్ళ అనుభవంలో చాలా సార్లు చూశారు.

ఆ రెండేళ్ళూ పూర్తి చేసి ఇంజనీరింగ్ లో జాయిన్ అయ్యారు అందరూ. యోగికి రూం మేట్ గా ఉన్న అరుణ్ కి యోగి సంగతి అందరికంటే బాగా తెలుసు. ఎప్పుడూ రూం నీట్ గా ఉండాలనే వాడు.

"మన వయసు కుర్రాళ్ళ రూములు ఇలాగే ఉంటాయిరా" అంటే ఒప్పుకునేవాడు కాదు.

" అదే తప్పు, మన చుట్టూ వాతావరణం బావుంటే మనకి బావుంటుంది" అనేవాడు. నీకు బద్ధకం అయితే ఊరుకో, నీవి కూడా నేనే సర్దేస్తాను " అని రూమంతా ఎప్పుడూ శుభ్రంగా ఉంచేవాడు. రోజూ రూములో రెండు అగరువత్తులు వెలిగించేవాడు. మంచి వాసన ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పరుస్తుంది అనేవాడు.

హాస్టల్ రూములు తుడవడానికి వచ్చే అమ్మాయి రీమా కూడా ఎప్పుడూ " యోగీ భయ్యా కా రూం ఇతనా నీట్ రహతా హై, బాకీ రూం ఐసా నహీ" అనేది కూడా.

ఇద్దరి డెస్క్ లూ, మంచాలూ, అలమార్లూ తనే సర్దే వాడు, అరుణ్ ఆశ్చర్యంగా చూసేవాడు. " ఒరే ఇన్నాళ్ళూ ఇవన్నీ ఆడపనులు అనుకునేవాణ్ణి " అంటూ.

"పనిలో ఆడ పనీ, మగ పని అని తేడాలుండవు, అందరికీ అన్ని పనులు రావడం ముఖ్యం, అది వంటైనా సరే, బాంక్ పనైనా సరే" అనేవాడు యోగి.

రూము సర్దుకోవడమనే చిన్న విషయాన్నించీ అన్నింటిలోనూ యోగీంద్ర ఆలోచనలు కొంత విభిన్నంగా ఉండేవి. ప్రతీ విషయాన్నీ ఆలోచించి మరీ నిర్ణయించుకునేవాడు, అది ఆ స్నేహితులెప్పుడో గమనించారు, అందుకే అతని మాటని గౌరవించేవారు. అప్పుడప్పుడు తమ సరదాల కోసం అతన్నీ బలవంతంగా తమతో తీసుకెళ్ళేవారు, తన అభిప్రాయం నిర్మొహమాటంగా చెప్పినా స్నేహితులకోసం కొన్ని భరించేవాడు. అలా వాళ్ళ స్నేహం బలపడింది.

ఇంజనీరింగ్ మూడో సంవత్సరం లో ఉన్నప్పుడు వాళ్ళ క్లాస్ వాళ్ళు పిక్నిక్ ప్లాన్ చేశారు.

" ఒరే ఫ్రెండ్స్ అందరూ రెండు రోజులు ట్రిప్ కి వెళదామంటున్నారు జయపూర్, ఉదయపూర్ అవీ, మనం కూడా వెళదామా? " వినయ్ అన్నాడు.

" ట్రావెలర్స్ వాళ్ళ బస్ లో వెళదామంటున్నారు, మనిషికింత అని కట్టేస్తే అన్నీ వాళ్ళే చూసుకుంటారు హాయిగా, సరదాగా వెళ్ళి వద్దాం " అన్నాడు కార్తీక్.

" నేను రాను, మీరు వెళ్ళండి " అన్నాడు యోగి.

"అదేమిట్రా? నీకు ట్రావెల్ అంటే ఎంతో ఇష్టం కదా మరి ఇలా అంటావేం? అందరం కలిసి వెళ్దాం సరదాగా " అన్నాడు అరుణ్ కూడా.

" ఎందుకో నాకు అలా పాకేజ్ టూర్ లా వెళ్ళడం ఇష్టం లేదు. వాడు ఎక్కడ ఆగమంటే అక్కడ ఆగాలి, ఎంత సేపు చూడమంటే అంతసేపు చూసేసి మళ్ళీ వెనక్కి వచ్చేయాలి. ఇదంతా నాకెందుకో చిరాకు. నా దృష్టిలో మనం మనకిష్టమైన చోటికి, ఇష్టమైన రీతిలో వెళ్ళాలి. ఎక్కడ కావాలంటే అక్కడ ఆగి, ఎంత సేపు కావాలంటే అంత సేపు చూసి రాగలగాలి. ఇలా ఎవరో వెనక తరుముతున్నట్టు

పరుగులతో చూడటం ఎందుకు? అక్కడకి వెళ్ళినప్పటినించీ ఒకరి మీద ఒకరు పడి ఫోటోలు తీసుకోవడం తప్ప మరేమీ ఉండదని నా అభిప్రాయం. మీరు ముగ్గురు వెళ్ళి రండి, మనం నలుగురం మళ్ళీ వెళదాం కావలిస్తే " అన్నాడు.

వాళ్ళకి అతని లాజిక్ అర్థం కాలేదు, అర్థం అయినా నచ్చలేదు.

" నీ మొహం, నువ్వు అన్నింటికీ ఏదో సోది చెప్తావు. మనం ఉద్యోగస్థులం అయ్యాకా అలాగే, నువ్వు కోరినట్టే వెళదాం లే. ఇది ప్రస్తుతం కాలేజీ ట్రిప్, అందరితో కలిసి వెళ్ళడం అన్న సరదా తప్ప, అక్కడవన్నీ చూసే కోరికా, ఓపికా ఎవరికీ ఉండదు. ఊరికే ఉపన్యాసాలు ఆపి బయలుదేరు. ఒరే నువ్వు డబ్బు కట్టేసి రారా? ఎలా రాడో ? చూద్దాం ! " అన్నాడు కార్తీక్.

అలా వాళ్ళు నలుగురూ ఆ ట్రిప్ కి వెళ్ళినా సరే యోగి చెప్పిన విషయాలన్నీ వాళ్ళ అనుభవం లోకి రానే వచ్చాయి.

చదువులు పూర్తవుతూనే, ఒకే కంపెనీలో కాకపోయినా ఒకే ఊర్లో నలుగురికీ ఉద్యోగాలు రావడం వాళ్ళకెంతో సంతోషాన్ని కలిగించింది. యోగి ఇంటి పరిస్థితులు అతన్ని పై చదువులకి వెళ్ళనీయకుండా అడ్డు పడ్డాయి. రెండు మూడేళ్ళు పని చేశాకా అందరూ కలిసి జీ. మాట్ రాసి ఎం. బీ. ఏ చదువుకోవాలని నిర్ణయించుకుని ఉద్యోగాలలో చేరారు. ఒకే ఊరు కావడాన నలుగురూ కలిసి రెండు బెడ్ రూముల ఇల్లు అద్దెకు తీసుకున్నారు.

" ఒరే, నేను మళ్ళీ యోగి రూములోనే" అన్నాడు అరుణ్ నవ్వుతూ

" మాకు తెలుసులేరా, వాడితోటైతే రూము సర్దుకోనక్కరలేదని నీ ఆశ. అలా ఏమీ కుదరదు, ఇదేం హాస్టల్ కాదు. మనం నాలుగేసి నెలల చొప్పున యోగితో రూము షేర్ చేసుకుందాం" అన్నారు మిగతా ఇద్దరూ అరుణ్ ని ఏడిపించడానికి.

అలా మొదలయింది వాళ్ళ ఉద్యోగపర్వం.

రాత్రి పొద్దుపోయేవరకూ పని చెయ్యడం, ఉదయాన్నే పొద్దెక్కేవరకూ పడుకోవడం. ఎప్పుడు నిద్ర లేస్తే అప్పుడు గబ గబా తయారయి ఆఫీసుకు చేరడం, తల మునకలయ్యేలా పని. ఇలాగే సాగేది వాళ్ళ దినచర్య.

ఎంత రాత్రి పడుకున్నా పొద్దున్నే ఆరుగంటలకే లేచేవాడు యోగి. బ్రష్ చేసుకుని కాఫీ తాగుతూ పేపరో, తనకి నచ్చిన పుస్తకమో చదువుకుని అప్పుడు తయారయ్యి వెళ్ళేవాడు. దానివల్ల మిగతావారంత ఆదరాబాదరా ఉండేది కాదు. కార్పోరేట్ పని ఒత్తిడి అతనికీ తప్పేది కాదు అప్పుడప్పుడు.

ఉద్యోగంలో చేరిన రెండేళ్ళ తర్వాత ఓరోజు "మా ఇంట్లో పెళ్ళి చేసుకోమని ఒకటే పోరు పెడుతున్నారు రా" అన్నాడు అరుణ్.

" ఇంకేం మరి! చేసేసుకో, ఓ పని అయిపోతుంది" అన్నాడు కార్తీక్ నవ్వుతూ.

" నాకప్పుడే చేసుకోవాలని లేదు, ఎలా చెప్పాలో తెలియడం లేదు" అన్నాడు అరుణ్.

" ఎలా చెప్పాలో ఏమిటి? ఉన్న మాటే చెప్పు. అప్పుడే నాకు పెళ్ళేమిటి? నా వయసెంతని? అని అడుగు " అన్నాడు యోగి.

" ఉద్యోగంలో చేరావు, రెండేళ్ళయింది. బాధ్యతలేమీ లేవు, బాదరబందీలేమీ లేవు.ఇంక చక్కగా పెళ్ళి చేసుకో అంటున్నారు" అన్నాడు దిగులుగా.

" అది తల్లితండ్రులందరూ చెప్పేదే. ఇరవై రెండేళ్ళకి ఉద్యోగం, పాతికేళ్ళకి పెళ్ళి, ఆ తర్వాత ఇల్లు, పిల్లలూ. అంతే, వాళ్ళకి కావలసినది" అన్నాడు కార్తీక్.

" నిజమేరా, మా అమ్మ కూడా ఈ మధ్యన ఇన్ డైరెక్ట్ గా చెప్తోంది, ఇంకా డైరెక్ట్ స్పీచ్ మొదలవలేదనుకో" అన్నాడు వినయ్ కూడా నవ్వుతూ.

యోగి మాట్లాడ లేదు, ఆ మాటకొస్తే అతని ఇంట్లోనూ పరిస్థితి దీనికేమీ భిన్నంగా లేదు, ముఖ్యంగా నాలుగునెలల క్రితం చెల్లెలి పెళ్ళి చేసినప్పటినించీ మరీ. కానీ అతను స్థిరంగా చెప్పాడు. తనకి కొంత టైము కావలనీ, అన్నీ ఆలోచించి సమయం వచ్చినప్పుడు తనే చేసుకుంటానని. అతనికర్ధం కాని విషయం ఒక్కటే. కార్తీక్ చెప్పినట్టు ఫలానా వయసులో ఫలానాది జరగాలని ఎవరు నిర్ణయిస్తారు? ఏ ప్రాతిపదికన? అనుకుంటే అతనికి చిన్నగా నవ్వు వచ్చింది. ముప్పై ఏళ్ళకి పెళ్ళి చేసుకుంటే అది పెళ్ళి కాదా? ఒకవేళ దాటాకా చేసుకుంటే అదేమైనా తప్పా? ఇలాంటి ఆలోచనలు వస్తూ ఉంటాయి అతనికి. ఎప్పుడూ ఎవరో చెప్పినట్టు, నిర్దేశించినట్టు బ్రతకడమేనా జీవితమంటే??

" మీ ఇంట్లో పరిస్థితి ఏమిట్రా? అన్న అరుణ్ మాటలకి నవ్వుతూ " మా ఇల్లూ, మనుషులూ మిగతావారికేమీ భిన్నం కాదు" అన్నాడు.

అతని ఆలోచన అంతటితో ఆగలేదు. చదువుకునే వయసులో పోటీ పరీక్షల కోసం అర్ధం లేకుండా, అదే లోకం లా చదవడం, ఆ తర్వాత ఉద్యోగాల పేరిట వేళా పాళా లేకుండా ఆఫీసులకి అతుక్కుపోవడం, అది మొదలవుతూనే పెళ్ళీ, పిల్లలూ అంటూ మరొక అధ్యాయం మొదలుపెట్టడం, ఈ లోపులో ఇళ్ళూ, కార్లూ, ఫోన్ లూ, మ్యూజిక్ సిస్టం లూ, హోం థియేటర్లూ అంటూ అనేక విషయాల వెంట పరుగులూ, ఒకరిని చూసి మరొకరు పెట్టే ఉరుకులూ.. ఒక్క క్షణం ఆగి ఆలోచించుకునే వ్యవధి, వెసులు బాటూ లేదా ఎవరికీ? అనుకుంటాడు అతను.

"పెద్దవాళ్ళు అన్నీ ఆలోచించి, అనుభవం మీద చెప్తారు అనుకో! అయినా ఇప్పుడే పెళ్ళంటే నాకిష్టం లేదురా" అన్నాడు అరుణ్.

" నాకూ అంతే" అన్నాడు వినయ్ గబ గబా.

" కొన్నాళ్ళు సరదాగా ఎక్కడికైనా తిరిగి వద్దామా?" అన్నాడు యోగి.

" ఓ యస్, నేను రెడీ. నిన్ననే మా కొలీగ్ అంటున్నాడు సింగపూర్ కి మంచి రేట్లలో టిక్కట్లు దొరుకుతున్నాయిట అని, వెళదామా? అన్నాడు వినయ్ త్వరగా.

" మన దేశంలోనే చూడాల్సినవెన్నో ఉన్నాయి, అవన్నీ వదిలేసి సింగపూర్ ఎందుకు? "అన్నడు యోగి.

" ఫారెన్ హాలిడే అంటే దాని గొప్ప వేరు కదరా, పైగా ఇప్పుడు బయటకి వెళ్ళడానికే టిక్కట్లు చవక" అన్నాడు వినయ్.

యోగి మాట్లాడలేదు.

"మీరు చెప్పండిరా, ఓకే అంటే కనుక్కుంటాను అన్నాడు మిగతా ఇద్దరితో.

" మరి ఇల్లు బుక్ చేద్దాం అనుకుంటున్నాం కదా! " అన్నాడు అరుణ్.

అవునురా, ఆ మాటా నిజమే, కనీసం ఇల్లు బుక్ చేస్తే మనకి పెళ్ళి ఒత్తిడి కొంత తగ్గుతుందేమో కొన్నాళ్ళవరకూ అన్నాడు వినయ్.

ఇప్పుడు బుక్ చేస్తే ప్రీ బుకింగ్ రేట్ లో ఇస్తానంటున్నాడు, పక్కనే మెట్రో స్టేషన్ కూడా వస్తుందిట కూడా. తొందరలోనే అక్కడ రేట్లు పెరుగుతాయి, అప్పుడు మనం ఇన్వెస్ట్ చేసినందుకు ఎంతో లాభం కూడా అన్నాడు కార్తీక్ నిన్న రాత్రి చూసిన బ్రోచర్ ని మళ్ళీ చేతిలోకి తీసుకుంటూ.

తాత్కాలికంగా సింగపూర్ హాలిడే గురించి మర్చిపోయి ముగ్గురూ ఆ ఫ్లాట్ ల గురించి మాట్లాడుకోవడం మొదలు పెట్టారు. ఒకవేళ తీసుకుంటే దానికి కావలసిన లోన్, కట్టవలసిన ఇన్స్టాల్ మెంట్ లూ, ఎప్పటికి తయారవుతాయి వంటి విషయాలన్నింటి గురించీ గడ గడా మాట్లాడుకోవడం మొదలు పెట్టారు.

" మేమిన్ని మాట్లాడుతుంటే నువ్వేమీ మాట్లాడవేరా? "అని అడిగాడు కార్తీక్ యోగిని.

" నాకెందుకో ఇదేమంత నచ్చటం లేదురా? మన జీతాలని చూసి లోన్లు ఇస్తున్నారు కదా అని తీసేసుకుని, ఆ తర్వాత ఈ. ఎం. ఐ ల పేరిట ఏళ్ళ తరబడి వడ్డీలు కట్టుకుంటూ కూర్చోవడం తప్ప నాకేమీ కనబడటం లేదు, ఎందుకో నాకీ 'కోకిల గూళ్ళు" కట్టాలనిపించడం లేదు, నన్నొదిలెయ్యండి" అన్నాడు నెమ్మదిగా.

" కోకిల గూళ్ళా?" అంటే ?" సందేహంగా అన్నాడు కార్తీక్.

" నా మనసుకు అనిపించింది చెప్తాను, ఇది తప్పో, రైటో నాకు తెలీదు. ముందే చెప్పినట్టు బాంక్ వాళ్ళిస్తున్నారు కదా పెద్దమొత్తం లో అప్పు తీసుకుని పెద్ద ఇల్లు కొంటాము. దానికి తగ్గ హంగూ, ఆర్భాటాలు కూర్చుకుంటాము. అక్కడనించీ నెల నెలా కట్టవలసిన ఇన్స్టాల్ మెంటు మొదలు. దాంట్లో వడ్డీ కెంత పోతుందో? అసలుకెంత పోతుందో ? ఒక్క సారి లెక్క వేసి చూడండి. మనం అప్పు తీర్చేనాటికి అన్నీ చేరి ఎంత అవుతుందో? ఆలోచించండి, అప్పటివరకూ మన ఇంటి విలువ పెరుగుతుందని అనుకున్నా, మనం అప్పు తీర్చడానికి కట్టిన డబ్బుకీ, పెరిగిన ధరకీ ఎక్కడో చెల్లుకి చెల్లు అవుతుంది అని నా నమ్మకం.

అప్పు తీరేవరకూ ఇది మన ఇల్లు కానే కాదు నిజానికి, బాంక్ అధీనం లో ఉన్నదే. అంటే అది ఉన్నా లేనట్టే, అందుకే "కోకిల గూళ్ళు "అన్నాను. కోకిల గూడే కట్టదు, ఇక్కడ కట్టిన గూడు మనది కానే కాదు అన్న భావనలో. నాకెందుకో ఉన్న నాలుగురోజులు మన అభిరుచులకీ, అలవాట్లకీ అనుగుణంగా ఉండడం మేలని అనిపిస్తుంది. కొంత డబ్బు దాచుకుని, నేను అనుకున్న సమయంలో తీర్చగలను అన్న చిన్న మొత్తం లోన్ తీసుకుని నాకు నచ్చిన ఇల్లు కొనుక్కోవడం మంచిదని అనుకుంటాను. ఈరోజు ఇల్లు అవుతుంది, రేపు కార్ లోన్ వాళ్ళు వస్తారు, మన కార్తీక్ అప్పుడే రెండో కార్ గురించి కూడా ఆలోచించాడు కదా. ఇంక ఫారిన్ హాలిడే ల గురించి చెప్పనే అఖ్ఖరలేదు.

ఇది, ఇదెక్కడ ఆగుతుందో? తెలియడం లేదు నాకు. వెనక్కు రాలేని ఈ చక్రాల్లో పడి ఎప్పటికీ తిరుగుతూ, ఏదో ఒక అప్పు భారాన్ని మన నెత్తిన మోస్తూ ఉండడం అవసరమా? అనేదే నా ఆలోచన. మన సీనియర్లని చూస్తే ఆవిషయం తేలిగ్గా అర్థం అవుతుంది. ఒక ఇల్లు ఉండడానికి, మరొకటి ఇన్వెస్ట్మెంట్ అంటూ రెండు, మూడు ఇళ్ళూ, రెండు మూడు కార్లూ.. ఇంచుమించుగా అందరి ఆలోచనలూ ఇవే, అందరి లైఫ్ స్టైల్ ఇదే. నాకెందుకో మనం ఇంకో రెండు మూడు సంవత్సరాలు ఆగి, కొంత డబ్బు దాచుకుని అప్పుడు స్వంత ఇంటివైపు చూడడం మంచిదని అనిపిస్తోంది. అప్పుడే అవి మన కాకి గూళ్ళు అవుతాయని నా నమ్మకం " అన్నాడు.

మిత్రులందరూ ఆలోచనలో పడ్డారు.

●●●

Click here to share your comments on this story